క్లుప్తంగా

ఎమ్మెల్సీ బొత్సకు పడాల అభినందనలు



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న అప్పలనాయుడు

మాడుగుల రూరల్ : ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల నుంచి ఏకగ్రీవంగా శాసనమండలికి ఎన్నికైన బొత్స సత్యనారాయణను ఎం.కోడూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, గ్రామశాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయడు సోమవారం విశాఖలో కలిశారు. సత్యనారాయణ శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఎంపిక కావడం పట్ల అభినందనలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ విజేతకు నేడు అభినందన

రోలుగుంట : బీబీపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గడిచిన విద్యా సంవత్సరంలో టెన్త్‌లో 565 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన హేమలతకు ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి తమ పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చిన కసిరెడ్డి హేమలతకు మంగళవారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశామని, ఆహ్వానితులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని హెచ్‌ఎం అప్పారావు విజ్ఞప్తి చేశారు.

1 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

కె.కోటపాడు : అధిష్ఠానం పిలుపు మేరకు మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సెప్టెంబర్ 1 నుంచి నిర్వహించనున్నట్టు మండల బీజేపీ అధ్యక్షుడు కొట్టాన ఈశ్వరరావు తెలిపారు. కె.కోటపాడులో సోమవారం జరిగిన పార్టీ మండల కార్యవర్గం సమావేశంలో మాట్లాడారు. వచ్చే నెల 1న కె.కోటపాడులో జరపనున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ శ్రేణులు విస్తృతంగా పాల్గొని పెద్ద సంఖ్యలో సభ్యులను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది సన్యాసిరావు, శరగడం సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాలు పచ్చగా...



కె.కోటపాడు-సింగన్నదొరపాలెం మధ్య పచ్చగా కనిపిస్తున్న వరినాట్లు పూర్తయిన పొలాలు

కె.కోటపాడు : కె.కోటపాడు-సింగన్నదొరపాలెం గ్రామాల మధ్య రోడ్డును ఆనుకొని ఉన్న పంటపొలాలు వరినాట్లు పూర్తి కావడంతో పచ్చగా కళకళలాడుతున్నాయి. వర్షాలతో పాటు కె.కోటపాడు పైడమ్మ చెరువులో నీరు ఉండడంతో ఆయకట్టు పరిధిలో గల పొలాల్లో నాట్లు పూర్తయ్యాయి. దీంతో కనుచూపు మేరలో గల పొలాలన్నీ వరినాట్లతో పచ్చదనంతో పరుచుకున్నట్లుగా చూపరులను ఆకట్టుకుంటోంది.

వాడ్రాపల్లిలో క్రీడా పోటీలు



వాడ్రాపల్లిలో ఆటల పోటీలు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో సోమవారం పలు ఆటల పోటీలు నిర్వహించారు. పెతకంశెట్టి జోగినాయుడు మాస్టారు గ్రంథాలయం వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన పోటీలను వ్యాపారవేత్త కొయిలాడ దశావతారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు, కమిటీ అధ్యక్షుడు మళ్ల జోగినాయుడు, కాండ్రేగుల శ్రీను, లీలా భాస్కరరావు, దాడి గణేష్, రామారావు పాల్గొన్నారు.

చట్టాలను కఠినతరం చేయాలి



వైద్యులు, సిబ్బంది రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. విధి నిర్వహణలో కొందరు పేషెంట్లతో వచ్చేవారి నుంచి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. నిత్యం రాత్రి వేళల్లో పీహెచ్‌సీల వద్ద పోలీసు గస్తీని తప్పనిసరి చేయాలి. ప్రధానంగా మహిళలపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వాలు చట్టాలను మరింత కఠినతరం చేయాలి.

–శ్రీవిద్య, వైద్యాధికారి, మాకవరపాలెం పీహెచ్‌సీ

దాడులకు దిగడం తగదు



వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చేవారు వైద్య సిబ్బందితో మర్యాదగా మెలగాలి. వైద్యం అందించే వైద్య సిబ్బందిని వారి కుటుంబ సభ్యుల్లా చూసుకోవాలి. ఆస్పత్రికి పోలీసు నిఘా ఉండాలి. మహిళా అటెండరు ఉండాలి. మహిళా వైద్యులకు, నర్సింగ్ స్టాఫ్‌కు తగిన భద్రత కల్పించాలి.

–నిర్మల, వైద్యాధికారి, చౌడువాడ పీహెచ్‌సీ, కె.కోటపాడు మండలం

–మాడుగుల

బాబోయ్...బీఎన్ రోడ్డు..!

- ఈ దారిలో ప్రయాణం నరకం
- బెంబేలెత్తుతున్న వాహనదారులు
- బురదలో కూరుకుపోతున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



శింగవరం బీఎన్ రోడ్డులో బురదలో కూరుకుపోయిన ట్రాక్టరును లాగుతున్న దమ్ము ట్రాక్టర్

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) ప్రధాన రోడ్డులో గోతుల్లో వాహనాలు బురదలో కూరుకుపోవడంతో పలువురు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుదిరెడ్ల పాలెం, పొట్టిదొరపాలెం, శింగవరం, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం, కొమ్మళ్లపూడి తదితర గ్రామాల వద్ద పెద్దపెద్ద గోతులు పడ్డాయి. తారు రోడ్డు మొత్తం ఊడిపోయి బురద రోడ్డుగా మారాయి. గోతుల్లో నీరు చేరి ఎక్కడ గొయ్యి ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురౌవుతున్నారు. సోమవారం ఉదయం శింగవరం వద్ద కర్రలు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ రోడ్డు మధ్యలో బురదలో కూరుకు పోయింది. ఎంతకూ కదలక పోవడంతో ట్రాక్టర్ డ్రైవర్ పంట పొలాల్లో దమ్ములు దున్నుతున్న మరో ట్రాక్టర్ డ్రైవర్‌ను బండి లాగాలని అభ్యర్థించాడు. దమ్ము ట్రాక్టర్ డ్రైవర్ బురదలో కూరుకు పోయిన కర్రల లోడు ట్రాక్టర్‌ను బయటకు లాగాడు. ఆదివారం రాత్రి బుదిరెడ్ల పాలెం వద్ద లోడుతో వెళ్తున్న లారీ రోడ్డు మధ్యలో బురదలో కూరుకుపోవడంతో వాహనాలు నిలిచి పోయాయి. పొక్లెయిన్‌ను తీసుకొచ్చి లారీని బయటకు తీయడంతో వాహనదారులు తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. బీఎన్ రోడ్డు గోతుల్లో నుంచి రాకపోకలు సాగించడానికి పలువురు వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. తక్షణం గోతులను పూడ్చాలని వేలాది మంది వాహనదారులు కోరుతున్నారు.

ఇది రోడ్డా...చెరువా..!



మర్రిపాలెం వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

నాతవరం : ఏకొద్ది పాటి వర్షం పడినా ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నీరంతా నిల్వ ఉండిపోవడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. తాండవ జంక్షన్ నుంచి మండల కేంద్రం నాతవరం వెళ్లే మధ్యలో మర్రిపాలెం గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నీరు నిల్వ ఉండిపోతుంది. ఇక్కడ రోడ్డు ఇరువైపులా ఎత్తుగా చేసేయడంతో నీరు పోయే మార్గం లేక నిల్వ ఉండిపోతుంది. ఆ ప్రదేశంలోనే ప్రభుత్వ పాఠశాల కూడా ఉంది. పాఠశాల గేటు లోపల నుంచి బయటకు వస్తే ఈ నీటిలోంచే విద్యార్థులు ఉపాధ్యాయులు రాకపోకలు సాగించాలి. మండల కేంద్రానికి వెళ్లే అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సైతం ఈ దారిలోనే ప్రయాణించాలి. రోడ్డుపై నీరు కారణంగా విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, వెంటనే రోడ్డుపై నీరు తొలగించే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎంపీటీసీ నిధులతో అభివృద్ధి పనులు



ఎం.కోడూరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు గ్రామంలో స్థానిక ఎంపీటీసీ సభ్యులు ముమ్మిన రమణబాబు తన ఎంపీటీసీ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఒక లక్ష రూపాయల వ్యయంతో దుర్గాలమ్మ ఆలయం చుట్టు ప్రహరీగోడ నిర్మాణంతో పాటు గ్రామంలో రెండు చోట్ల సీసీ రోడ్లు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఎంపీటీసీ రమణబాబు తెలిపారు. ఈ పనుల పర్యవేక్షణలో స్థానిక వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, ఉప సర్పంచ్ గెంజి రాజేష్, వార్డు సభ్యులు పోతిన జగదీష్ పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు ఘన నివాళులు



మదర్‌థెరిసా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

నర్సీపట్నం: మదర్‌థెరిసా జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ స్టేడియంలోని మదర్ థెరిసా విగ్రహానికి వాకర్స్ క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు, విశ్రాంత ఎంఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆమె లేకపోయినా ఆమె అందించిన మానవతా సేవలు సజీవంగా ఉన్నాయని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గజ్జలమ్మ, రంగా, పిట్ల శ్రీనివాసరావు, శంకర్‌రెడ్డి, అల్లు అప్పారావు, వియ్యపు గోవిందరావు పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలోని తామరంలో మదర్ థెరిసా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న థెరిసా విగ్రహానికి సోమవారం తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పేదలు, రోగులకు థెరిసా చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఆమె ఆశయ సాధనకు అంతా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తామరంలో థెరిసా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హరిబాబు, తదితరులు

జయకృష్ణా ముకుందా మురారి

- వేడుకగా జన్మాష్టమి
- కృష్ణుడికి విశేష పూజలు
- ఉత్సాహంగా ఉట్టి కొట్టే సంబరాలు



దేవరాపల్లి : రైవాడలో ప్రత్యేక అలంకరణలో బాలగోపాలుడు



మాడుగుల రూరల్ : కె.జె.పురంలో శ్రీకృష్ణుడు తిరువీధి ఉత్సవం



మాడుగుల రూరల్ : ఎం.కృష్ణాపురం శ్రీ కృష్ణ ఆలయంలో..



చీడికాడ : బి.సింగవరం శ్రీకృష్ణ ఆలయంలో..



రోలుగుంట : వేణుగోపాలస్వామికి పూజలు



నాతవరం : జిల్లేడుపూడిలో శ్రీకృష్ణుడు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



చీడికాడ : శ్రీకృష్ణ వేషధారణలో పాఠశాల విద్యార్థులు

బుచ్చెయ్యపేట :బుచ్చెయ్యపేట మండలంలో క్రిష్టాష్టమి వేడుకలను మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మేజర్ పంచాయితీ వడ్డాది, మండల కేంద్రం బుచ్చెయ్యపేట, ఎల్‌బీ పురం, గొల్లకొంపలు, మల్లాం, శివరాంపురం, పెదపూడి, పొట్టిదొరపాలెం, కేపీ అగ్రహారం, కందిపూడి తదితర గ్రామాల్లో ఆలయాల్లో సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు శ్రీ క్రిష్ణున్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలు గ్రామాల్లో ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్న సమారాధనలు జరిపారు. భజనలు చేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని అలరించాయి.

మాడుగుల రూరల్ : జన్మాష్టమి సందర్భంగా కె.జె.పురం రామాలయంలో గల ఉపాలయంలో శ్రీకృష్ణుడు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. భజన, పవలింపు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. 1 వ అంగన్‌వాడీ కేంద్రంలో, అంగన్‌వాడీ కార్యకర్త పి.చంద్ర సారథ్యంలో జరిగిన వేడుకల్లో చిన్నారులు బాలకృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. ఎం. కోడూరు గ్రామంలో జరిగిన వేడుకల్లో మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. ఎం.కృష్ణాపురం గ్రామంలో ఉట్టికొట్టే ఉత్సవం ఉత్సాహంగా జరిగింది. యాదవ సంఘం చిన్ని కృష్ణ యూత్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సహకారంతో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నాతవరం: మండలంలోని గొల్లపేట గ్రామంలో ఎంపీటీసీ సభ్యులు లోకా లోవరాజు జిల్లేడుపూడి గ్రామంలో బీజేపీ మండల నాయుకుడు సబ్బి కుమారస్వామి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద మహిళలు చిన్నారులతో కోలాటాలు, భజనలు నిర్వహించారు, మధ్యాహ్నం అన్న సమారాధనలు జరిగాయి.

మాకవరపాలెం: మండలంలోని గిడుతూరు, రాచపల్లి, అడిగర్లపాలెం, మాకవరపాలెంలో ఉన్న కృష్ణుడి ఆలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. మాకవరపాలెంలో అన్న సమారాధన నిర్వహించారు. జి.కోడూరు ఎస్.జి.కె. స్కూల్లో విద్యార్థులు కృష్ణుడు, గోపికల సాంస్కృతిక వేషధారణలు అలరించాయి. అడిగర్లపాలెంలో త్రైత సిద్ధాంత భగవద్గీతను భక్తులకు వివరించారు.

మాడుగుల: సత్యవరం గ్రామంలో సోమవారం యాదవ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరిగాయి. శ్రీకృష్ణవిగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

మాడుగుల: సాగరం గ్రామంలో కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా చిన్నికృష్ణుడి విగ్రహాన్ని పూల మాలలతో సుందరంగా అలంకరించారు. ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకటరాజారామ్‌తో పాటు యాదవ సంఘ సభ్యులు, గ్రామస్తులు స్వామిని దర్శించుకున్నారు.

చీడికాడ : శ్రీకృష్ణా జన్మాష్టమి సందర్భంగా బి. సింగవరం శ్రీకృష్ణ ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అక్షర శ్రీ విద్యానికేతన్ స్కూల్లో జరిగిన వేడుకల్లో రాధాకృష్ణుల వేషధారణల్లో విద్యార్థులు అలరించారు. ఉట్టికొట్టి, ఆటపాటలతో సందడి చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అప్పలరాజుపురం, దండి సురవరం, చుక్కపల్లి గ్రామాల్లో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. చుక్కపల్లి గ్రామంలో అన్నసమారాధన జరిపారు. ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. పార్టీ నేతలు ప్రసాదరావు, మాజీ ఎంపీపీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలో గల వేణుగోపాల స్వామి ఆలయాల్లో శ్రీకృష్ణ జయంతి పురస్కరించుకొని ఉత్సవాన్ని యాదవ సంఘాలు ఘనంగా నిర్వహించారు. ధర్మకర్త సాంబశివరావు కుటుంబ సభ్యులతో కలసి స్వామిని దర్శించుకున్నారు. రోలుగుంటలో స్వామివారికి శ్రీ సిద్ధి వినాయక సంఘం కార్యదర్శి తానారి సత్తిబాబు దంపతుల ఆధ్వర్యంలో పూజలు చేశారు.

కె.కోటపాడు : గుల్లేపల్లి గ్రామంలో సర్పంచ్ బండారు దేముళ్లు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరిగాయి. యాదవ సంఘం సభ్యులతో కలిసి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మధ్యాహ్న ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిపారు. ఆర్.వై.అగ్రహారం కృష్ణాలయంలో మాజీ డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, మాజీ సర్పంచ్ చల్లా శకుంతల పూజలు చేశారు.

దేవరాపల్లి : స్థానిక యాదవ యూత్ సంఘం, పెద్దల ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు సోమవారంతో ఘనంగా ముగిసాయి. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, పైలా ప్రసాదరావు, కిలపర్తి భాస్కరరావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని వడ్డన చేశారు. ఉట్టి మహోత్సవంలో పాల్గొన్నారు. ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, బంధం అప్పలరాజు, వారాది దేముళ్లు తదితరులు యాదవ సంఘం యూత్ సభ్యులు పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేట : ఎల్.బి.పురంలో శ్రీకృష్ణుడికి పూజలు



దేవరాపల్లి : ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



మాడుగుల : శ్రీకృష్ణాష్టమి పూజల్లో పాల్గొన్న ఎంపీపీ రాజారామ్, తదితరులు



మాకవరపాలెం : కృష్ణుడు, గోపికల వేషధారణలో జి.కోడూరు విద్యార్థులు



మాడుగుల రూరల్ : కె.జె.పురం అంగన్‌వాడీ కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు

రైవాడలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ చల్లా లక్ష్మీ, చల్లా నాయుడు పాల్గొన్నారు.

చోడవరం: స్థానిక శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల తిరుపతి దాసరి సాహిత్య కోలాట బృందం నృత్యాలు అలరించాయి. స్వామికి ఆలయ అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ప్రత్యేక పూజలు చేశారు. వెంకన్నపాలెం, గంధవరం గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. రాధాకృష్ణుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై వైభవంగా ఊరేగించారు. పలు చోట్ల అన్న సమారాధనలు జరిపారు.



చోడవరం : వేణుగోపాలస్వామి ఆలయం శ్రీకృష్ణుడికి పూజలు

వెలుగు సీసీ మృతికి సంతాపం



సీతంనాయుడు (ఫైల్)

కె.కోటపాడు : కె.కోటపాడు వెలుగు పథకంలో క్లస్టర్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.సీతంనాయుడు(53) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. స్వగ్రామం సబ్బవరం మండలం టెక్కలి పాలెంలో వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటుతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు ఆయనను ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు యత్నిస్తున్న సమయానికి మృతిచెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. మండలంలో క్లస్టర్ కోఆర్డినేటర్‌గా ఐదేళ్లుగా పనిస్తున్న సీతంనాయుడు అంకిత భావంతో విధులు నిర్వహించి అధికారుల మన్ననలు పొందారు. ఆయన మృతికి వెలుగు పెందుర్తి ఏరియా కోర్డినేటర్ రాజేశ్వరి, ఏపీఎం వెంకటలక్ష్మి, సీసీలు వెంకటరావు, సూర్యనారాయణ, సురేష్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సీతంనాయుడు అంత్యక్రియలకు వెలుగు ద్వారా రూ.25వేల నగదును కుటుంబ సభ్యులకు అందించారు.

గోతులతో పొంచి ఉన్న ప్రమాదం



నర్సీపట్నం నుంచి చింతపల్లి వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద గుంతలు



గుంతలతో ఎదురెదురుగా వచ్చే వాహనాలతో పొంచి ఉన్న ప్రమాదం

నర్సీపట్నం : నర్సీపట్నం నుంచి చింతపల్లి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానస్థితితో దర్శనమిస్తోంది. నిత్యం వందల మంది రాకపోకలు సాగించే రహదారి పీనారపాలెం వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి సుమారు 70 రోజులు కావస్తున్నా గోతులను పూడ్చడం గాలికి వదిలేసింది. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతలు వర్షం నీటితో చెరువులను తలపిస్తున్నాయి. రహదారిపై ఈ గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్లకు మరమ్మతులు చేయాలని, ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.